## ఖాతాదారుల సహకారంతోనే సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లాభాల బాట

● సొసైటీ చైర్మన్ పీ.ఆర్.వీ.ఎస్ రాజు



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ పీ.ఆర్.వీ.ఎస్ రాజు

వనస్థలిపురం : ఖాతాదారుల సహకారంతో సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లాభాల బాటలో పయనిస్తుందని సొసైటీ చైర్మన్ పీ.ఆర్.వీ.ఎస్ రాజు అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని శ్రీకన్వెన్షన్ హాల్లో ఖాతాదారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సొసైటీ చైర్మన్ పీ.ఆర్.వీ.ఎస్ రాజు మాట్లాడుతూ 25సంవత్సరాలుగా నాలుగు వందల కోట్ల లావాదేవిలతో 5రాష్ట్రాల్లో 42 బ్రాంచీలతో తమ సొసైటీ నిర్విరామంగా పని చేస్తుందన్నారు. 150 కోట్ల లావాదేవీలతో వనస్థలిపురం బ్రాంచి, 97 కోట్ల లావాదే వీలతో సుభద్రనగర్ బ్రాంచీలు విరాజిల్లుతున్నాయని తెలిపారు. తమ సొసైటీ లావాదేవీలు ఖాతాదారుల సహకారంతో సాధ్యమైందన్నారు. ఖాతాదారుల సహకారంతో భవిష్యత్‌లో మరింత లాభాల బాటలో ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, సోమలింగంగౌడ్, ఇ.సరిత, వీ.శివరాజ్యం, ఎం.రమ్య, ఎం.ఏ మారుతి, రమణ, డీ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## వారం రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి

● లేదంటే హోటల్‌ను సీజ్ చేస్తాం : కమిషనర్ రవీందర్‌రెడ్డి


హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందజేస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో వర్షం నీటి కోసం ఏర్పాటు చేసిన నాలాలో పక్కనే ఉన్న సంపూర్ణ హోటల్ నిర్వాహకులు డ్రైనేజీ మురుగును నాలాలో వదిలేస్తున్న దానిపై 'డ్రైనేజీ మురుగుతో కంపుకొడుతున్న నాలా' అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనానికి మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ విభాగం అధికారులు స్పందించారు. ఈ మేరకు సంపూర్ణ హోటల్‌తో పాటు పక్కనే ఉన్న మరో హోటల్ నిర్వాహకులకు నోటీసులు అందజేసి డ్రైనేజీ మురుగుతో నిండిన నాలాను పరిశీలించారు. ఇష్టం వచ్చినట్లుగా ఎక్కడ పడితే అక్కడ డ్రైనేజీ మురుగును వదిలేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. ఔటర్ జంక్షన్, జాతీయ రహదారి పక్కనే మురికి కూపంగా తయారు చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా సమస్యకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. లేనిపక్షంలో హోటల్‌ను సీజ్ చేస్తామని తెలిపారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దశరథతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి

హయత్‌నగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం గురువారం చైర్‌పర్సన్ అనురాధ రాంరెడ్డి అధ్యక్షతన రాగన్నగూడ వార్డు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అందజేసే రక్షక పరికరాలు, దుస్తులు, వాహనాల మరమ్మతులు, జంతువుల నియంత్రణ, వివిధ వార్డులలో భూగర్భ డ్రైనేజీ పనుల నిర్వహణ, రోడ్డు మరమ్మతులు, మంచినీటి సరఫరా, వర్షాల కారణంగా పాడైన రోడ్ల మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకుల తొలగించుట, ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలల మరమ్మతులతో పాటు 24 అంశాలపై చర్చించి అభివృద్ధి పనులకు ఆమోదం తీసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్, వైస్ చైర్ పర్సన్ హరిత ధన్‌రాజ్ గౌడ్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కొత్తపేట, జూన్ 20(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన న్యూనాగోల్ కాలనీవాసులతో కలిసి రోడ్ నెం.1, 2, 3, 3/ఏలలో పాడైన మ్యాన్‌హోళ్లను, జలమండలి సిబ్బంది చేపడుతున్న మరమ్మతులను పరిశీలించారు. ఆ తర్వాత ఆయన డివిజన్ సమస్యలపై జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్‌తో, జలమండలి అధికారులతోనూ చర్చించారు. బాక్స్‌డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని ఈఈ శ్రీనివాస్, ఏఈ మాతృనాయక్‌లను కోరారు.

## ఆలయంలో గ్రానైట్ బండల ఏర్పాటుకు శంకుస్థాపన

చంపాపేట, జూన్ 20(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని సత్యనారాయణస్వామి వ్రత మండపం చుట్టు చేపట్టనున్న యాంటీ స్కిడ్ గ్రానైట్ బండల ఏర్పాటు పనులకు గురువారం ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఈఓ ఎం. శ్రీనివాసశర్మతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, బిల్లకంటి కిరణ్‌కుమార్ గుప్తా, ముద్దా కళ్యాణ్‌చక్రవర్తి, చాతిరి మధుసాగర్, చీర తిరుమలేష్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, చేగోని సురేష్‌గౌడ్, యాదగిరి, సాంబరాజు శైలజ పాల్గొన్నారు.

## తక్షణమే నీట్ పరీక్ష రద్దు చేయాలి: సీపీఎం

సైదాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): తక్షణమే నీట్ పరీక్ష రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కోరుతూ సీపీఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ చౌరస్తాలో గురువారం ధర్నా నిర్వహించారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లీకేజీపై కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం ఎందుకు వహిస్తుందో ప్రజలకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డీ.అబ్బాస్, జిల్లా నాయకులు బాలునాయక్, విఠల్, మీనా, కోటయ్య, శ్రావణ్, గిరిజన నాయకులు శోభన్‌నాయక్, కిషన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా శ్రీలత


రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీలత

చాదర్‌ఘాట్ : ఆర్టీసీ రంగారెడ్డి రీజినల్ మేనేజర్‌గా జె.శ్రీలత గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ రీజినల్ మేనేజర్‌గా పని చేసిన శ్రీలత రంగారెడ్డి రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన ఎ.శ్రీధర్ ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలోని మార్కెటింగ్ విభాగానికి బదిలీ అయ్యా రు. మూడు నెలలుగా ఖాళీగా ఉన్న ఈ పదవిలో శ్రీలత బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆమె హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్‌ను కలవగా ఆయన అభినందించారు. ఎంజీబీఎస్ సీఆర్‌ఎం బి.శ్రీనివాస్, ఈఈ రవీందర్‌సింగ్ తదితరులు శ్రీలతకు ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## మీర్‌పేట్‌లో చెయిన్ స్నాచర్ అరెస్టు

● 14గ్రాముల బంగారు నగలు, ద్విచక్రవాహనం స్వాధీనం

సరూర్‌నగర్: మీర్‌పేట్ పోలీసులు గురువారం ఓ చెయిన్ స్నాచర్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి 14 గ్రాముల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య కాలనీకి చెందిన కుంభం పద్మ బీఎన్‌రెడ్డినగర్ బస్టాపు నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బైకుపై వచ్చిన గుర్తు తెలియని దుండగుడు ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును అపహరించుకుపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా.. పద్మ మెడలోని గొలుసు అపహరించింది సర్వేపల్లి వినయ్(23) అని గుర్తించారు. ఏపీలోని నెల్లూరు జిల్లా కొండాపురం మండలం, గోటిగుండాల గ్రామానికి చెందిన వినయ్ బీఎన్‌రెడ్డినగర్‌లో అద్దెకు ఉంటూ కార్పెంటర్ పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతడు సులువుగా డబ్బు సంపాదించడానికి గానుదొంగతనాలను ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలో పద్మ గొలుసును అపహరించాడని, గురువారం అతడిని అరెస్టు చేసి 14గ్రాముల బంగారు నగలు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.


గుర్రంగూడ స్కూల్‌లో చిన్నారులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి


జిల్లెలగూడ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేస్తున్న మీర్‌పేట్ మేయర్ దుర్గ


కొత్తపేటలో విద్యార్థినికి నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


సైదాబాద్‌లోని ఎంహెచ్‌గుప్తా హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ శ్వేత

# విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● మీర్‌పేట్, బడంగ్‌పేట్ మేయర్లు దుర్గ, పారిజాత

సరూర్‌నగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థు లు చిన్నతనం నుంచే తమ ఆరోగ్యంపై దృష్టిపెట్టి ఆరో గ్య పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మీర్‌పేట్, బడంగ్‌పేట్ మేయర్లు ఎం.దుర్గాదీప్‌లాల్, చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల కోసం అందజేస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి జడ్పీహైస్కూల్, గుర్రంగూడలోని ప్రాథమిక పాఠశాలల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆయా కార్యక్రమాల్లో బడంగ్‌పేట్ కౌన్సిల్ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడ్ దడిగ శంకర్, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, గజ్జెల రాంచందర్, మీర్‌పేట్ ఆర్వో అంజన్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జిల్లెలగూడ స్కూల్ హెడ్మాస్టర్ సరళాదేవి, వైద్యాధికారులు డాక్టర్ వైశాలి, నర్సింగ్‌రావు, నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఐలమ్మ పాల్గొన్నారు.


హస్తినాపురం డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్ పీఎస్‌లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో కార్పొరేటర్ సుజాతానాయక్

### నులిపురుగుల నివారణతో ఆరోగ్యం: శ్వేత

సైదాబాద్: నులి పురుగులను నివారిస్తేనే చిన్నారుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఎంహెచ్‌గుప్తా హైస్కూల్‌లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరు మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాదన్నపేట యూపీహెచ్‌ఎసీ వైద్యాధికారి డాక్టర్ కౌసర్‌తబ్సూమ్, సునీత పాల్గొన్నారు.

### నులిపురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

కొత్తపేట: కొత్తపేట జడ్పీహెచ్‌ఎస్, శివమ్మనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గురువారం కార్పొరేటర్ పవన్‌కుమార్ విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.వెంకట్ నరేష్, డా.అరవింద్, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు విజేందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

### చంపాపేట ప్రభుత్వ పాఠశాలలో..

చంపాపేట: చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం హెచ్‌ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు లక్ష్మి, సుదేష్ణ, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, సంధ్యాల కావ్య పాల్గొన్నారు.

### హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం కార్పొరేటర్ సుజాతానాయక్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడా జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దన్నే రాజుతో పాటు పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆదిత్యానగర్ రోడ్డు పనులు ప్రారంభం

● పర్యవేక్షించిన మేయర్ పారిజాత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఆదిత్యానగర్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ ఆదిత్యానగర్‌కాలనీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రోడ్డు దుస్థితి, స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనం రూపంలో వెలుగులోకి తేవడంతో అధికారులు, పాలకులు స్పందించారు. ఈ క్రమంలో గత శనివారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కమిషనర్ రఘు, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, శంకర్ తదితరులు కాలనీలో పర్యటించి రోడ్డు దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆదిత్యానగర్ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. గతంలో కంకర పరిచి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులను మొదలు పెట్టారు. దాంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మేయర్ పారిజాతానర్సింహారెడ్డి గురువారం స్వయంగా రోడ్డు పనులను పర్యవేక్షించారు. రోడ్డు నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, పనులు తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ యాదయ్య, కార్పొరేటర్లు లక్ష్మారెడ్డి, శంకర్, ఆదిత్యానగర్‌కాలనీ అధ్యక్షుడు పుట్టగల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌పై చర్యలు తీసుకోండి

సైదాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న జయనగర్‌లోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పేరెంట్స్ కమిటీ సభ్యులు సైదాబాద్ మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. స్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆటస్థలం, లైబ్రరీ సదుపాయాలు లేవని, క్వాలిఫైడ్ టీచర్లు లేరని ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో అబ్దుల్ అజీజ్, అబ్దుల్ వాహిద్, అబ్దుల్ రషీద్, 16మంది పేరెంట్స్‌కమిటీ సభ్యులు ఉన్నారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించిన వ్యక్తి రామోజీ

వనస్థలిపురం : నమ్మిన సిద్ధాంతం కోసం పరితపించిన వ్యక్తి రామోజీరావు అని టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. రామోజీరావు సంస్మరణ కార్యక్రమాన్ని నాగోల్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, దైవజ్ఞశర్మ, ఉప్పల స్వప్న, భాగ్యలక్ష్మి, మంజుల, సర్వాచారి, హర్ష పాల్గొన్నారు.

## యోగా డేను పురస్కరించుకొని విద్యార్థుల ర్యాలీ

చంపాపేట, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని లోటస్‌ల్యాప్ పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కడెం చంద్రశేఖర్‌రెడ్డి, యోగా గురువు ఇస్మాయిల్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం సాయిరాంనగర్‌కాలనీలోని పార్కులో విద్యార్థుల చేత ఇస్మాయిల్ గురూజీ యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.మాధవి, కాలనీ ప్రధాన కార్యదర్శి చంద్రపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషఫణి, మేనేజర్ నందికొండ రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జి నాగరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్-కర్మన్‌ఘాట్ రహదారిపై మురుగు పరుగు

ఎల్‌బీనగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్-కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిపై మురుగు పరుగుకు కారణం ప్రభుత్వ వైఫల్యమా లేక అధికారుల నిర్లక్ష్యమా అని లింగోజిగూడ మాజీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ నాయకుడు చిత్తలూరి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. సరూర్‌నగర్-కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిపై మురుగునీరు పొంగిపొర్లుతుండడంతో అందులోనే నిల్చుని స్థానికులు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. వారికి చిత్తలూరి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రధాన రహదారిపై వేలాది మంది నిత్యం ప్రయాణిస్తు ఉంటారని అంతే కాకుండా పరిసర కాలనీలవాసులు కూడా రాకపోకలు సాగిస్తూ ఉంటారన్నారు. మురుగునీరు పొంగిపొర్లుతుండటం వల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల ప్రభాకర్‌గుప్తా, వేముల విజయ్, ఓర్సు కృష్ణ, గుర్రం యాదయ్య, వెంకటమ్మ, కొండమ్మ, పెద్దులమ్మ, భాగ్యమ్మ, జయమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# తలసాని శంకర్‌యాదవ్‌కు ప్రముఖుల నివాళి


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షులు శంకర్‌యాదవ్ దశదిన కర్మకు పలువురు ప్రముఖులు హాజరై నివాళ్లు అర్పించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో శంకర్‌యాదవ్ దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, లక్ష్మణ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్‌రావు, మహమూద్ అలీ, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, బల్మూరి వెంకట్, సురభివాణిదేవి, మధుసూదనాచారి, ఎగ్గే మల్లేశం, బండ ప్రకాశ్‌ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లకు చెందిన వర్తకులు, హమాలీ కార్మికులు తదితరులు శంకర్ యాదవ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## భూగర్భ విద్యుత్ కేబుల్ పనుల అడ్డగింత


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ అధ్యక్షుడు బీసుకుంట్ల సతీష్‌గౌడ్

చంపాపేట, జూన్ 20(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో ప్రమాదకరంగా మారనున్న అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులను తమ కాలనీల మీదుగా చేపట్టవద్దని నిర్మాణ పనులను పలు కాలనీల ప్రతినిధులు అడ్డుకున్నారు. గురువారం కటికోనికుంటలో విద్యుత్ కేబుల్ ఏర్పాటు కోసం గొయ్యి తొవ్వుతుండగా కాలనీవాసులు నిలిపివేశారు. నిరుపేదలు ఉంటున్న కాలనీలో విద్యుత్ కేబుళ్ల ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు తీయవద్దని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కాలనీలను కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు, నాయకులు భద్రీనాథ్, తోకటి కిరణ్, నారాయణరెడ్డి, యాదగిరి, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మదన్‌మోహన్‌రెడ్డి, రాంలక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, నాగేష్, శ్యాం పాల్గొన్నారు.

### కేబుల్ వద్దని ఎమ్మెల్యేకు వినతి

ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారనున్న అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నిర్మాణ పనులను తమ కాలనీల మీదుగా చేపట్టవద్దని కోరుతూ గురువారం చంపాపేట డివిజన్ నెహ్రూనగర్ (కటికోనికుంట) కాలనీ అధ్యక్షుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త బీసుకుంట్ల సతీష్ గౌడ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ కటికోనికుంట, శిఖరాఎన్‌క్లేవ్‌కాలనీ, శ్రీరాఘవేంద్రకాలనీల మీదుగా 33/11కేవీఏ విద్యుత్ కేబుల్‌ను అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 15ఫీట్ల రహదారిలో కేబుల్ ఏర్పాటు చేస్తే రాబోయే రోజుల్లో ఆయా కాలనీలవాసులు వాటర్, డ్రైనేజీ కనెక్షన్ తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సైదాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మాదన్నపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూరజ్ జంగ్ కీ దేవిడీ రెయిన్ బజార్ రోడ్డులో ఓ ఇంటి ఎదుట సుమారు 45-50 మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు మాదన్నపేట పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహం ఉస్మానియా మార్చురీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మిగతా వివరాలకు ఫోన్ నెంబరు 8712661297లలో సంప్రదించాలని కోరారు.

## చిరువ్యాపారులను వేధించకండి.. వారికి న్యాయం చేయండి

● జీహెచ్‌ఎంసీకి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు లేఖ



జడ్సీ పంకజకు లేఖను అందజేస్తున్న ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములుగౌడ్, మద్దిలేటి

ఎల్‌బీనగర్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ ముందున్న చిరువ్యాపారులను వేధించవద్దని.. వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జీహెచ్‌ఎంసీకి లేఖ రాశారు. కూనంనేని లేఖను ఏఐటీయూసీ నేతలు గురువారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు అందజేశారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ ఎదురుగా వ్యాపారం చేసుకుంటున్న చిరువ్యాపారులను జీహెచ్‌ఎంసీ, పోలీసులు అధికారులు వేధిస్తున్నారని వారికి న్యాయం చేయాలని సాంబశివరావు లేఖలో కోరారు. వీలైనంత త్వరగా చిరువ్యాపారులకు న్యాయం చేకూరే విధంగా చూడాలని సరూర్‌నగర్ ఉప కమిషనర్ సూజాతకు జోనల్ కమిషనర్ సూచించారని ఏఐటీయూసీ సరూర్‌నగర్ అధ్యక్షుడు బోయపల్లి రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డి చెప్పారు. ఏళ్ల తరబడిగా చిరువ్యాపారులు పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారని వారు తెలిపారు. పండ్ల మార్కెట్ తరలించారు కదా రోడ్డుపై వ్యాపారాలు చేసుకోవడానికి వీలు లేదని పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు నాలుగు నెలలుగా వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. చిరువ్యాపారులను తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డుపాలవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వారికి న్యాయం చేయాలని రాములుగౌడ్, మద్దిలేటి డిమాండ్ చేశారు. లేనట్లయితే చిరువ్యాపారులను ఏకం చేసి పెద్దఎత్తు న పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ, ఏఐటీయూసీ హయత్‌నగర్ మండల కార్యదర్శి సక్రూనాయక్, సరూర్‌నగర్ మండల కౌన్సిల్ నాయకులు జ్యోతి చిన్నారి పాల్గొన్నారు.

## విద్యార్థుల బస్ రూట్లలో ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్

రద్దీ సమయంలో అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేసే బస్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం నేపథ్యంలో పీక్ సమయాల్లో ఉదయం, సాయంత్రం మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఫుట్‌బోర్డు ప్రయాణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఎవరూ ఎక్కకుండా చర్యలు చేపడుతున్నారు. బోయిన్‌పల్లి-బాలానగర్- గండి మైసమ్మ రూట్/సికింద్రాబాద్-ఉప్పల్ - ఘట్‌కేసర్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బస్సుల్లో రోజువారీ ప్రయాణాలు సాగించే విద్యార్థులు అధికారుల సూచనలు పాటించడంతో పాటు జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షాఖాన్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పలు కాలనీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజకు కాలనీవాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పార్కు సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు.